క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయురారోగ్య సిద్ధ్యర్థం ధన్వంతరేష్టి (హోమం) మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన చతుఃస్థానార్చన, మూల మంత్ర హవనాలు, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా, ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సేవా భావంతోనే సంతృప్తి



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలోని సాటి వారికి సేవ చేయడం ద్వారా మానసిక సంతృప్తి లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లో ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి నాయకులను అభినందించారు. అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ, ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి నాయకులు టీఆర్ శర్మ, శంకర సుబ్బారావు, చల్లా శ్రీనివాస్, గురు శర్మ తదితరులు పాల్గొన్నారు.

జనమంతా ముఖ్యమంత్రి జగన్ వెంటే

- జగనన్నే మా భవిష్యత్ సక్సెస్
- ఏలూరులో 67 వేల మంది మిస్డ్ కాల్స్
- పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని, మేయర్ నూర్జహాన్, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి



పార్టీ కార్యాలయంలో స్టిక్కర్ విడుదల చేసిన మేయర్ నూర్జహాన్, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, నగర అధ్యక్షుడు బొద్దాని, తదితరులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలు తమ విశ్వాసాన్ని చాటుకున్నారని, జనమంతా జగనన్న వెంటే ఉన్నారని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అన్నారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొద్దాని మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో ఏప్రిల్ 7 తేదీ నుంచి 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా, ఏలూరు నియోజకవర్గంలోనూ మెగా పీపుల్స్ సర్వే చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఏకంగా కోటి కుటుంబాలను పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు స్వయంగా కలిసి సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను సేకరించారని తెలిపారు. ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై తమ అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు.

ప్రజాభిమానం రుజువైంది

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ, అభిమానాన్ని రుజువయ్యాయని తెలిపారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రకటించి మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది జగనన్న సైనికులు ఈ సర్వేలో పాల్గొన్నారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలో 2,992 మంది గృహసారథులు, 200లకు పైగా కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగస్వాములయ్యారని చెప్పారు.

చిత్తశుద్ధిని చాటుకున్నారు

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో దళారీ వ్యవస్థను, జన్మభూమి కమిటీలను, ప్రజా ప్రతినిధుల సిఫార్సులకు స్వస్థి పలుకుతూ అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటమే ధ్యేయంగా పాలన అందించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీలను సైతం నిత్యం ప్రజల మధ్య ఉంచుతూ ఇంటింటికీ పంపుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవటం, వాటిని పరిష్కరించటమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక నాయకులు సీఎం జగనన్న మాత్రమే అన్నారు. సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరాలు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్‌కుమార్, కిలాడి దుర్గారావు ఉన్నారు.

మేడే పోస్టర్ విడుదల



మేడే పోస్టర్ విడుదల చేసిన ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వాల్ పోస్టర్‌ను ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు సోమవారం విడుదల చేశారు. నాయకుడు జె.గోపి మాట్లాడుతూ 8 గంటల పని కోసం చికాగోలోని కార్మిక వర్గం పోరాడి ప్రాణ త్యాగాలు చేసి తమ రక్తంతో తడిసిన గుడ్డను జెండాగా ఎగురవేశారని గుర్తు చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఆయన పిలుపు నిచ్చారు. మేడేను నగరంలోని ఆటో డ్రైవర్లు, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయ వంతం చేయాలన్నారు. రవాణా రంగంలోని కార్మికులు నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్నారని, వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ. జాన్ బాబు, బొడ్డు వర ప్రసాద్, ఆర్‌వీఎస్ కుమార్, మున్సిపల్ ఆఫీస్ సెంటర్ స్టాండ్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు అవార్డులు శుభపరిణామం



కలకుర్రు సర్పంచ్, సచివాలయ కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం



ఇన్‌చార్జి ఎంపీడీఓ సరళకుమారిని సన్మానించిన పాలకవర్గ సభ్యులు

ఏలూరు రూరల్: పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికే తలమానికం అని జెడ్పీటీసీ మండల సరస్వతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు సర్టిఫికెట్లు అందించి, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సరస్వతి మాట్లాడుతూ అభివృద్ధి, ఆరోగ్యం, పరిశుభ్రత, బాలలు, మహిళల స్వావలంబన, గుడ్ గవర్నెన్స్, మౌలిక వసతుల అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సర్వే చేపట్టిన అవార్డుల ప్రకటించడం మంచి ఆలోచనన్నారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారంటూ ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళ కుమారిని జెడ్పీటీసీ సరస్వతి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కొండలరావు, సర్పంచ్ బలే నాగప్రసాద్, పత్యాల సునీత, సైదు భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కాకర్ల తంబి, బలే స్వాతి, బొమ్మవరపు మణమ్మ, ఏపీఓ కిషోర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన పంచాయతీలు

ప్రీ పావర్టీ, లైవ్లీహుడ్ అంశంలో కాట్లంపూడి, గుడివాకలంక, కలకుర్రు గ్రామాలు మొదట మూడు స్థానాల్లో నిలిచాయి. ఆరోగ్యకర పంచాయతీ అంశంలో శ్రీపర్రు, కలకుర్రు, గుడివాకలంక పంచాయతీలు, బాలల అనుకూల పంచాయతీలుగా శ్రీపర్రు, కాట్లంపూడి, కలకుర్రు గ్రామాలు నిలిచాయి. క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలుగా గుడివాకలంక, కలకుర్రు, మాదేపల్లి. సురక్షిత తాగునీరు సరఫరా అంశలో మాదేపల్లి, శ్రీపర్రు, గుడివాకలంక మెరుగైన స్థానాలు సాధించాయి. స్వయం స్వావలంబన సాధించిన పంచాయతీలుగా చాటపర్రు, మల్కాపురం, పెదయాగనమిల్లి గుర్తింపు పొందాయి. గుడ్ గవర్నెన్స్ అంశంలో మొండికోడు, శ్రీపర్రు, చాటపర్రు మొదట మూడు స్థానాల్లో నిలిచాయి. వీటితో పాటు కలకుర్రు, పెదయాగనమిల్లి, కాట్లంపూడి గ్రామాలు మహిళ సాధికారత సాధించిన పంచాయతీలుగా నిలిచాయి.

ఇంజినీరింగ్ విద్యార్థినికి న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఇంజినీరింగ్ విద్యార్థినిపై దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, యువతి కి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. కాకినాడలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఏలూరు శివారు ప్రాంతానికి చెందిన యువతిని పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన అనుదీప్ అనే వ్యక్తి ప్రేమపేరుతో పరచయం ఏర్పచుకుని నమ్మించి దుగ్గిరాలకు తీసుకొచ్చి చిత్రహింసలకు పాల్పడి, వేడినూనె ఒంటిపై పోసి బలవంతానికి పాల్పడినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తును వేగవంతం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, యువతికి న్యాయం చేయాలని రవి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలకు తగిన రక్షణ కరువాతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితురిలికి పరామర్శ

ఏలూరు (టూటౌన్): ప్రేమోన్మాది దాడిలో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోన్న యువతిని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డీఎస్పీని కోరారు. మహిళా మోర్చానాయకురాలు కరెడ్ల దేవి, జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి కృష్ణకుమారి, జిల్లా మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ పులిబంటి సంధ్య, ఏలూరు పశ్చిమ మండల అధ్యక్షుడు నడపన దానభాస్కరరావు, మత్తి శ్రీనివాస శాస్త్రి, నగరపాటి సత్యనారాయణ, అడపాక సురేష్, తోట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై 20న ధర్నాలు

ఏలూరు (టూటౌన్): చేనేత రంగం పరిరక్షణ కోసం మే 20న అన్ని జిల్లాలోని చేనత, జౌళి శాఖ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మికక సంఘం రాష్ట్ర కమిటీసభ్యులు పిచ్చుక ఆదిశేషు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 21న కర్నూలు జిల్లా శ్రీశైలంలో జరిగిన రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి, ఉపవృత్తుల వారికి వర్తింపజేయాలని కోరారు. చేనేత కార్మికులకు ఇంటి నిర్మాణానికి ఇస్తున్న ఆర్థికసాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్లు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన వై.సత్యన్నారాయణ సోమవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ప్రాజెక్ట్ కాలువల మరమ్మతులు కోరుతూ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎంఎల్ ప్రజాపంథా నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన సేన సమితి నాయకులు

ఏలూరు (టూటౌన్): పెదవాడు ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేయాలని సీపీఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వచ్చే సీజన్ నాటికి పంటలకు సాగునీరు అందించాలని కోరారు. చెరువు గొల్లగూడెం గ్రామానికి తాగునీరు అందించాలని, మేడేపల్లి పంచాయతీ అల్లూరి నగర్ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోతల పథకం ప్రారంభించి విప్పలగుంపు, కోయ మాదారం చెరువులు నింపి తాగు, సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే గౌస్, సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, సోయం చంద్రరావు, మడి కన్నమ్మ పాల్గొన్నారు.

- జిల్లగూడెం గ్రామస్తులు కురసం నాగరాజు, సోడే రామారావు, సోడే భీమయ్య, రవ్వ ఉస్మాన్, సోయం నాగేశ్వరరావు తమ భూములకు బోర్లు, సోలార్ మోటార్లు అందించాలని, జిన్నులగూడెం గ్రామంలో అంతర్గత డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని వినతి పత్రాలను స్పందనలో అందజేశారు.

పంట భూములను కాపాడాలని వినతి

ముదినేపల్లి మండలం దేవపూడిలో అక్రమ ఆక్వా చెరువుల నుంచి పంట భూములను కాపాడాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై దర్యాప్తు చేసి రిపోర్టు ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశించారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్,కౌలు రైతుల సంఘం నాయకులు ఉల్లంకి నాంచారయ్య తెలిపారు. దేవపూడి గ్రామంలో అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులలో రొయ్యలు సాగు చేసి కలుషిత నీటిని పంట కాలువల్లోకి వదిలేయడం వల్ల భూములు చౌడులుగా మారి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీటిని తాగిన పాడి పశువులు రోగాల బారిన పడుతున్నాయని వివరించారు. అక్రమ ఆక్వా చెరువులను ధ్వంసం చేసి పంట భూములను కాపాడాలని వారు కోరారు.

వర్షాల నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం తరుపున స్పందనంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు వినతి పత్రం అందజేశారు. రైతులకు సరిపడా గోనె సంచులను ఇచ్చి, ధాన్యం రవాణా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాస్ కోరారు.

సాగు పట్టాలివ్వాలని వినతి

ఏలూరు (టూటౌన్): లింగపాలెం మండలం తవ్వ చిలక, రాయుడుపాలెం గ్రామాలకు చెందిన దళిత రైతు కుటుంబాలకు సాగు పట్టాలు ఇవ్వాలని బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని జేసీ లావణ్యవేణికు వినతి పత్రం అందజేశారు. పై గ్రామాలకు చెందిన 16 కుటుంబాలు గత 50 సంవత్సరాలుగా 12.62 ఎకరాల బంజి పోరంబోకు భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నాయని, వారికి శాశ్వత సాగు భూమి పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్లకు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు లక్కపాము చంటి, పింగుల ఇతియా, విస్సన్నపల్లి సురేష్, బుల్లా రవికుమార్ తదితురులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ కోరారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి నెలలో కురిసిన వర్షాలకు తోడు శని, ఆదివారాల్లో ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి ధాన్యం రాశులు, చేలల్లో ఉన్న వరి పనలు తడిసి అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొంత భాగం, ఏలూరు, కోనసీమ అంబేద్కర్ జిల్లాల్లో ధాన్యం కల్లాలలోనే ఉందని తెలిపారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని కోరారు. మెట్ట ప్రాంతాల్లో అరటి, జీడిమామిడి పంటలు వడగళ్ల వాన వల్ల మచ్చ వచ్చి పూర్తిగా దెబ్బతిన్నాయని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో మిర్చి పంట దెబ్బతిందని తెలిపారు. గుంటూరు జిల్లాలో పిడుగు పాటుకు ఐదుగురు రైతులు మృతి చెందారని, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కొబ్బరి, పామాయిల్ మినహా అన్ని పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

శాంతిభద్రతలకు పెద్ద పీట వేయాలి

పెదవేగి : గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బందికి సూచించారు. సోమవారం సాధారణ తనిఖీల్లో భాగంగా పెదవేగి పోలీస్‌స్టేషన్ ఎస్పీ సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల మెయిన్‌టెనెన్స్ తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఫ్రెండ్లీ పోలీస్‌గా మెలగాలని సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	130
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	60
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

దొంగమస్తర్లు వేయనందుకు మహిళా మేట్లపై దౌర్జన్యం

దెందులూరు: దొంగమస్తర్లు వేయడానికి నిరాకరించినందుకు కొత్తగూడెం గ్రామంలో తమపై దౌర్జన్యం చేశారని విధులకు ఆటంకం కల్పించారని గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం మేట్లు ఆరోపించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఉపాధి మేట్లు ఆడపాల నాగమణి, ఇన్నిగిరి సరస్వతి, షేక్ మెహర్నిష భేగం మాట్లాడుతూ ఉపాధి పనికి దొంగ మస్తర్లు వేయాలని కడగల మౌనిక, వంజరపు సావిత్రి, కడగల లక్ష్మి, పంటల వెంకటలక్ష్మి, గొర్రెల వెంకట రమణారావు, గొర్రెల వెంకటలక్ష్మి తమపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కల్పించారన్నారు. ఈ విషయంపై దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఏలూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్, శింగవరం వైఎస్సార్‌సీపీ నేత రాజు, మాట్లాడుతూ మేట్లపై జరిగిన దాడిని ఖండించారు. దొంగమస్తర్లు వేయకపోతే దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగిస్తారా అని ఆగ్రహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌లను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

అభివృద్ధిని చూడలేకే విమర్శలు

పెదపాడు: జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని వారు నోరు అదుపులో ఉంచుకుంటే మంచిదని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీకి చెంది ఓ వ్యక్తి ఇంజినీరింగ్ చదివే విద్యార్థినిపై అఘాయిత్యం చేసి ఆమెపై నూనెను పోసిన విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే చింతమనేని ప్రభాకర్ ఆరోగ్యశాఖ మంత్రిపై ఆవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. మహిళలంటే చిన్నచూపు ఉండబట్టే మంత్రిని కించపర్చే విధంగా అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నాడని దయ్యబట్టారు. చింతమనేనికి బుద్ధి మందగించడంతోనే బీసీ మహిళలపై స్త్రీలపై గౌరవం లేకుండా, సభ్య సమాజం తల దించుకునేలా ఉన్న ఆయన తీరును తప్పుపట్టారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. తక్షణమే మంత్రి విడుదల రజనికి బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ,, ఎంపీపీ బత్తుల రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు చెక్‌పోస్టు మార్పు

దెందులూరు: దెందులూరు కనకదుర్గమ్మ గుడి వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును దెందులూరు ఫ్లై ఓవర్ (ఏలూరు వైపు వచ్చే) వద్దకు మార్చారు. ఇప్పటి వరకు దెందులూరు కనకదుర్గమ్మ గుడి వద చెక్‌పోస్టు ఉంది. ఫ్లై ఓవర్ పూర్తయి వాహనాలు రాకపోకలు ప్రారంభం కావడంతో చెక్‌పోస్టును మార్చామని ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ వివరించారు.

